
సాక్షి
పెద్దపల్లి
సోమవారం, 10, జూలై, 2023



**మల్లన్న సన్నిధిలో జడ్జి పూజలు**

ఓదెల: మల్లన్న పెద్దపట్నం సందర్భంగా పెద్దపల్లి మున్సిఫ్ కోర్టు జడ్జి రాణి కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. జడ్జికి ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సన్మానించారు.



**కొనసాగుతున్న ఎత్తిపోతలు**

ధర్మారం: నందిమేడారం నంది పంప్‌హౌజ్ నుంచి రెండుపంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఉదయం 5, 7వ పంప్‌ను ప్రారంభించి 6,250 క్యూసెక్కుల నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### మహారాష్ట్రలో అధికారమే లక్ష్యంగా పాదయాత్ర



పాదయాత్ర సభ్యులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు

సుల్తానాబాద్: మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం రైతులను బానిసలుగా మార్చిందని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నామని ఆ రాష్ట్ర నాయకులు బాబారామ్ ఆన్స్కే, శోభన్ ఆన్స్కే అన్నారు. వారు చేపట్టిన పాదయాత్ర ఆదివారం సుల్తానాబాద్‌కు చేరుకున్న సందర్భంగా స్థానిక నాయకులు వారికి స్వాగతం పలికి సన్మానించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు సాజిత్, ముత్యం రమేశ్‌గౌడ్, నాయకులు వేగోళం రవీందర్ గౌడ్, బిరుదు రాధాకృష్ణ ఎండీ.రఫిక్ ఉన్నారు.

### బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



కండువాలు కప్పి స్వాగతిస్తున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. ఆదివారం స్థానిక మేడిపల్లి సెంటర్‌లో కార్పొరేషన్ 23వ డివిజన్ అంబేడ్కర్ కాలనీకి చెందిన పలువురు ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, యువజన కాంగ్రెస్ నాయకుడు ముచ్చకుర్తి రమేశ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పూర్తిస్థాయిలో పని చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో రామగుండంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పెగడపల్లి మధు, ఈదునూరి శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ‘ప్రశ్నించే గొంతును నొక్కుతున్న ప్రభుత్వాలు’



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): ప్రశ్నించే గొంతు నొక్కుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూస్తోందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన నిర్బంధ వ్యతిరేక వేదిక రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఊపా(అన్‌లాబుల్ ప్రీవెంట్ యాక్ట్) చట్టాన్ని, ఎన్ఐఏను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే మేధావులను ఊపా చట్టంతో అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. 2018 జనవరి నాటి భీమే కోరేగాం కుట్ర కేసు నుంచి మొదలుకొని ములుగు జిల్లా, తాడ్వాయి పోలీస్ స్టేషన్లో 152 మంది పౌర హక్కుల, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. ప్రజాస్వామికవాదులు, మేధావులపై పెట్టిన అన్ని ఊపా కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఊపా చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు తీర్మానించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ, రైతు సమస్యల సాధన సమితి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అరసం, విరసం, ఐఎఫ్‌టీయూ, పీసీకేఎస్ ప్రజా పంథా, పీవైఎల్, ఏఐఎఫ్‌టీయూ, న్యూ ఇండియా పార్టీ, ప్రజాఫ్రంట్, టీఎస్‌టీయూసీ, సింగరేణి ఉద్యోగుల సంఘం బాధ్యులు, పౌర హక్కుల సంఘం నాయకులు విశ్వనాథ్, మల్లన్న, రాములు, తోకల రమేష్, జూపాక శ్రీనివాస్, లెనిన్, వెంకటేశం, బాలసాని రాజన్న, ఐ.క్రిష్ణ, మల్లేష్, రాయమల్లు, రాయపోశం, పోషన్న, నారా వినోద్, పుల్ల సుచరిత, బొడ్డుపల్లి రవి, శ్రీపతి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మురుగు కాలువ ముత్తారం మండల కేంద్రంలోనిది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో నీటితో నిండి దోమలకు ఆవాసంగా మారింది. వానాకాలంలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణం దోమలే. ఇవి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు కాల్వలు, చెత్త అపరిశుభ్ర వాతావరణంలో గుడ్లు పెట్టి బాగా వ్యాప్తి చెందుతాయి. వీటితోనే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయి. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది.

# పడకేసిన పారిశుధ్యం..

**సమ్మెలో పంచాయతీ కార్మికులు**

- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు
- కనిపించని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

సాక్షి, పెద్దపల్లి: ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలని తదితర డిమాండ్లతో గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు గురువారం నుంచి సమ్మె బాట పట్టారు. జిల్లాలోని అన్ని జీపీల్లో పనిచేసే కార్మికులు విధులు బహిష్కరించారు. దీంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. పరిసరాలు, రోడ్లు, మురికి కాలువలు, చెత్తకుండీల్లో చెత్త పేరుకుపోతోంది. గ్రామాల్లో నీళ్ల వదలడం, వీధిలైట్లు ఆన్, ఆఫ్ చేయడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం ఇబ్బందిగా మారటంతో తీవ్ర దుర్గంధంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య ఇలాగే ఉంటే అంటురోగాలు, విష జ్వరాలు వ్యాపించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమల బాధ తీవ్రమైంది. కాలనీలు, వార్డుల్లో వ్యర్థపదార్థాలు, చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. సమస్య రోజురోజుకూ తీవ్రమయ్యే అవకాశం ఉండటం, అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు రోగాల బారిన పడుతుండడం.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**14 మండలాలు.. 1,300 మంది కార్మికులు**

జిల్లాలోని 14 మండలాలు.. 266 గ్రామ పంచాయతీల్లో బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, పంపు ఆపరేటర్లు, స్వీపర్లు, పారిశుధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లుగా సుమారు 1,300 మంది పనిచేస్తున్నారు. పారిశుధ్యం, పన్నుల వసూళ్ల ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. గ్రామజనాభా ప్రకారం వీరిని నియమించారు. గతంలో వీరికి రూ.3వేల వరకు వేతనం ఇచ్చేవారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.8,500 వేతనం ఇస్తూ మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించింది. రెండు నెలల క్రితం మరో రూ.1000 అదనంగా పెంచి రూ.9,500 ఇస్తోంది. అయితే చాలా జీపీల్లో జీవోలో పేర్కొన్న విధంగా వేతనాలు అందడం లేదు. అయితే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నంబరు 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, 11వ పీఆర్సీలో నిర్ణయించిన కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించడం వంటి తదితర డిమాండ్లతో నిరవధిక సమ్మె గురువారం ప్రారంభమైంది. సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేబీయూ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాలు మద్దతు పలుకుతున్నాయి.

**వర్షాలతో పెరుగుతున్న జ్వరపీడితులు**

వర్షాకాలం ప్రారంభంతోనే సీజన్ వ్యాధుల వ్యాప్తి మొదలైంది. తేలికపాటి వర్షాలకే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు పెరిగాయి. చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పోగై డ్రైనేజీల్లో ప్రవాహం నిలిచిపోతోంది. మురుగు కారణంగా దోమలు ప్రబలుతున్నాయి. దీంతో ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు కార్మికుల సమ్మెతో మరింత ప్రభావం చూపనుంది. పంచాయతీల్లో మల్టీపర్పస్ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో ఎలాంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని డీపీవో చంద్రమౌళి తెలిపారు.

**పని బారెడు వేతనం బెత్తెడు**



కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తాం. గ్రామాల్లో మల్టీపర్పస్ కార్మికుల పేరుతో సర్పంచులు, కార్యదర్శులు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. వేతనాలు మాత్రం సరిపడా ఇవ్వటం లేదు. – ఓదెమ్మ, పంచాయతీ కార్మికురాలు, పెగడపల్లి

**11వ పీఆర్సీని అమలు చేయాలి**



11వ పీఆర్సీ ప్రకారం ప్రభుత్వం కార్మికులకు జీతాలు ఇవ్వాలి. రూ.9 వేలకు తగ్గకుండా వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గ్రామాల్లో పారిశుధ్య పనులు, సమస్యలు రాకుండా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేది మేమే. మముల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.
– గౌసొద్దీన్, కారోబార్, కూనారం

### యువశక్తిని సద్వినియోగం చేస్తాం



స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఏర్పడితే బతుకులు మారుతాయనే గంపెడాశతో ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం పోరాడిన యువశక్తిని సీఎం కేసీఆర్ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. యువతకు ఉద్యోగాల కల్పన, స్వయం ఉపాధి తదితర అంశాలతో కూడిన యూత్ డిక్లరేషన్‌పై రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం పెద్దపల్లికి చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెమినిగౌడ్, నాయకులు శ్రీనుబాబు, సంపత్, మల్లన్న, సారయ్యగౌడ్, వరప్రసాద్, అక్బర్‌అలీ, ప్రకాశ్, తేజస్విని, సంపత్, సతీష్, శ్రీనివాస్, అశోక్, నరేశ్, సంతోష్, సర్వర్‌శ్రీకాంత్, రాజు తదితరులున్నారు.

### ప్యాసింజర్ రైళ్లరద్దు పొడిగింపు

రామగుండం: కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఇప్పటికే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన రైల్వేశాఖ.. మరో వారం పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్‌లో రద్దయిన రైళ్ల వివరాల బోర్డు ఏర్పాటు చేసి ంది. బల్లార్షా ఎక్స్‌ప్రెస్, కరీంనగర్ పుష్‌పుల్, భద్రాచలంరోడ్ సింగరేణి, రామగిరి తదితర రై ళ్లు ఇరువైపులా ఈనెల 16 వరకు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

# కొత్త రైతులకు సదావకాశం

- రైతుబీమాకు దరఖాస్తులు ఆహ్వానం
- నేటి నుంచి ఆగస్టు 5 వరకు గడువు
- 18 నుంచి 60ఏళ్ల లోపు పట్టాదారులు అర్హులు
- జిల్లాలో కొత్తగా పట్టాలు పొందిన రైతులు 18,783



ట్రాక్టర్‌తో సాగు చేస్తున్న రైతు

సుల్తానాబాద్: రైతు కుటుంబాలకు అండగా నిలవడానికి ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని తెచ్చింది. ఈ పథకంలో కొత్త రైతులు చేరేందుకు ఈనెల 10 నుంచి ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా పట్టా పొందిన రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుత లబ్ధిదారుల వివరాల్లో మార్పు చేసుకునేందుకూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అనారోగ్యం బారిన పడినా.. ప్రమాదవశాత్తు మరణించినా.. ఎలా చనిపోయినా బాధిత రైతు కుటుంబానికి రూ.5లక్షల సాయాన్ని ప్రభుత్వం ఇన్సూరెన్స్ ద్వారా అందించనుంది. రైతు చనిపోయిన వారంలోనే డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ పథకానికి అవసరమైన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతు మృతి చెందితే కుటుంబ సభ్యులు గ్రామ రెవెన్యూ, ఏఈఓ ద్వారా వ్యవసాయ అధికారులకు సమాచారమిస్తే చాలు.. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిహారం అందించేందుకు ఇన్సూరెన్స్ సంస్థకు సిఫార్సు చేశారు.

**అర్హతలివీ..**

- రైతు తన పొలానికి సంబంధించి పట్టాదార్‌పాస్ పుస్తకం కలిగి ఉండాలి.
- ఆధార్ కార్డులో వయస్సు 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.
- ఈ ఏడాది జూన్ 18వరకు పట్టాదార్ పాసుపుస్తకం పొందిన రైతులు మాత్రమే అర్హులు.
- ఎన్నిచోట్ల భూమి ఉన్నా బీమాకు మాత్రం ఒక చోటనే అర్హులు.
- సంబంధిత రైతులు వారే స్వయంగా కార్యాలయానికి వెళ్లి అధికారి సమక్షంలో దరఖాస్తు అందజేయాలి.
- పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఈనెల 10 నుంచి ఆగస్టు 5వ తేదీలోగా అందజేయాలి.





## ఘనంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు



ఓదెల: ఓదెల మల్లన్న స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య, పాలకవర్గం ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, గౌరీపూజ, పుణ్యాహవచనం, మంటపస్థాపన చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ఈవో సదయ్య, ఎంపీపీ కునారపు రేణుకదేవి, పాలకవర్గసభ్యులు సతీష్, బత్తుల రమేశ్, ఆరెల్లి మొండయ్యగౌడ్, మ్యాదగోని శ్రీకాంత్‌గౌడ్, కుమారస్వామి, చింతం స్వామి పాల్గొన్నారు.



# లాభాల వాటా ఎంత..?

- ఈ ఏడాది రూ.2,222 కోట్ల లాభాలు
- గతేడాది 30 శాతం కార్మికుల వాటా
- ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం భారీ లాభాలు సాధించింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.2,222 కోట్ల లాభాలు వచ్చినట్లు సంస్థ సీఎండీ ప్రకటించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.2,607 కోట్ల టర్నోవర్ సాధించి రూ.1227 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఈసారి బొగ్గు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.3,074 కోట్ల లాభాలు సాధించింది. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లించగా మిగిలిన రూ.2,222 కోట్లు లాభంగా ప్రకటించింది. గతేడాది 30శాతం కార్మికుల వాటాగా ప్రకటించిన విషయం తెల్సిందే. ఈసారి ఎన్నికల ఏడాది కావడంతో లాభాల వాటా ఎక్కువగా ప్రకటిస్తారని కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మొత్తంగా 66.70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసి రూ.32,830 కోట్ల టర్నోవర్ సాధించింది.



**ఏడేళ్లలో సాధించిన వాస్తవ లాభాలు**

| ఏడాది | లాభాలు (రూ.కోట్లలో) | వాటా (శాతం) | చెల్లించింది (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2015–16 | రూ.1001.17 | 23 | రూ.230.26 |
| 2016–17 | రూ.395.38 | 25 | రూ.98.84 |
| 2017–18 | రూ.1212 | 27 | రూ.327.27 |
| 2018–19 | రూ.1766 | 28 | రూ.493 |
| 2019–20 | రూ.993 | 28 | రూ.278.04 |
| 2020–21 | రూ.272.20 | 29 | రూ.79.06 |
| 2021–22 | రూ.1,227 | 30 | రూ.368.00 |
| 2022–23 | రూ.2,222 | ? | ? |

**కార్మికుల వాటా ఎంతో..?**

సింగరేణి సాధించిన లాభాల్లో కార్మికులకు యాజమాన్యం వాటా చెల్లిస్తూ వస్తోంది. 1999లో 10శాతం నుంచి ప్రారంభమైన వాటా.. ఏటా కొంత మేర పెంచుతూ వస్తోంది. గతేడాది 30శాతం ప్రకటించింది. లాభాలను సంస్థ సీఎండీ, కార్మికుల వాటా మాత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటిస్తారు. ఈ ఏడాది ఎన్నికలు రానుండడంతో లాభాల వాటా భారీగానే ఉంటుందని కార్మికులు చర్చించుకుంటున్నారు. సంస్థ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు లాభాల వాటా పెద్ద మొత్తంలో చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**సింగరేణికి లాభాల జోష్**

సింగరేణి సంస్థకు ఈఏడాది లాభాల జోష్ వచ్చింది. గతేడాదితో పోల్చితే భారీ లాభాలను సంస్థ ఆర్జించింది. రూ.2,222 కోట్ల లాభాలు సాధించడం ఇదే ప్రథమం. మహారత్న, మినీ మహారత్న కంపెనీలకన్నా సింగరేణి తన వృద్ధి రేటును భారీగా నమోదు చేసుకుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటికి 430 శాతం వృద్ధి రేటును సంస్థ నమోదు చేసుకుంది. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ 241 శాతం, పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ 114శాతం, కోలిండియా 86శాతం, ఆయిల్‌అండ్ నేచురల్ కార్పొరేషన్ లిమిటెడ్ 76శాతం, ఎన్టీపీసీ 57, గెయిల్ ఇండియా 21, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 17శాతం గత తొమ్మిదేళ్లలో తమ వృద్ధి రేటును నమోదు చేశాయి.

## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామానికి చెందిన గుజ్జేటి రవి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా రవి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో అతడి భార్య లక్ష్మికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న ప్రతీ కార్యకర్తకు బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బొంగాని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రాఘవాపూర్‌లో దుప్పి మృతి



దుప్పి కళేబరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–మంథని రహదారి సమీపంలోని రాఘవాపూర్ శివారులో ఆదివారం దుప్పి కళేబరాన్ని స్థానికులు గుర్తించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ మంగిలాల్‌తో పాటు సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దుప్పి కళేబరానికి పశు వైద్యాధికారి కమలాకర్ పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కలు దాడి చేసి తరమడం వల్లే దుప్పి మరణించి ఉంటుందని భావిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగయ్య తెలిపారు.

### దుబాయ్‌లో జిల్లావాసికి అనారోగ్యం

- స్వదేశానికి రప్పించేందుకు నేతల ఆర్థికసాయం



దుబాయ్‌లో ఫ్లైట్ టికెట్ అందిస్తున్న కొమురయ్య మిత్ర బృందం

జూలపల్లి(పెద్దపల్లి): ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేటకు చెందిన బొంగోని అంజయ్యగౌడ్ కొంతకాలం క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అనారోగ్యం పాలై పనిచేయలేని స్థితికి చేరాడు. అతడిని ఎలాగైనా ఇంటికి పంపించాలన్న తపనతో జూలపల్లి మండలం అబ్బాపూర్‌కు చెందిన కచ్చు కొమురయ్య విషయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ దృష్టికి తీసుకొచ్చాడు. స్పందించిన ఆయన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు తెలిపారు. కొమురయ్య అభ్యర్థన మేరకు అంజయ్యగౌడ్‌కు ఫ్లైట్ టికెట్ ఖర్చులు రూ.15 వేలు సాయం చేశారు. ఈక్రమంలో బాధితుడు ఇండియా వచ్చేందుకు ఆదివారం టికెట్ కొని పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా సాయం చేసిన మంత్రి, జెడ్పీ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్‌కు కచ్చు కొమురయ్య అంజయ్యగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



# సమ్మెకు సెకండ్ ఏఎన్‌ఎంలు సై..!

- చాలీచాలని వేతనాలతో విధులు
- సమస్యలపై పలుమార్లు ఆందోళన
- నేటి నుంచి 48 గంటలపాటు సమ్మె



సమ్మె నోటీస్ ఇస్తున్న ఏఎన్‌ఎంలు

సుల్తానాబాద్: కరోనా కట్టడిలో ముందునిలిచిన సెకండ్ ఏఎన్‌ఎంలు సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత విషయంలో మాత్రం ముఖం చాటేస్తున్నాయని అందుకే 48 గంటల సమ్మెకు దిగుతున్నామని పేర్కొంటున్నారు. 2001–02లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్ ద్వారా నియమించింది. ఇందులో కొన్ని పోస్టులను వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రమబద్ధీకరించారు. మిగిలిన వారిని ఎవరూ పట్టించుకోలేదు. విధి నిర్వహణలో రెగ్యులర్ ఉద్యోగులకు ఏమాత్రం తీసిపోకుండా పనిచేస్తున్నా బదిలీలు, పదోన్నతులు, విరమణ అనంతర ప్రయోజనాలు మాత్రం వీరు పొందలేకపోతున్నారు. ఈ క్రమంలో ప్రాథమిక అర్బన్, అరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు తాము సమ్మెకు వెళ్తున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ ఏఎన్‌ఎంల సంఘం తరఫున డీఎంహెచ్‌వోకు నోటీస్ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 10, 11వ తేదీల్లో సమ్మె చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు.

**ప్రభుత్వ నిబంధనల మేరకు..**

ప్రభుత్వ నిబంధన ప్రకారం ఏఎన్‌ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. మాతాశిశు సంరక్షణతోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలతోపాటు ఇమ్యూనైజేషన్ చేయాల్సి ఉంటుంది. గర్భిణులకు సాధారణ ప్రసవం కావడంతోపాటు తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా సూచనలు, సలహాలు ఇస్తారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫీవర్‌సర్వే బాధ్యతలను వీరికి అప్పగించింది. ఐహెచ్‌ఐపీ, ఈ–సంజీవనిని నిత్యం ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. కేసీఆర్ కిట్ల పంపిణీ, ఎన్సీడీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు, మందుల పంపిణీ, టీబీ, క్యాన్సర్, పక్షవాతం, వృద్ధులకు అలనా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**డిమాండ్లు ఇవీ..**

- ఎంపీహెచ్ (డబ్ల్యూ)కు రెగ్యులర్ కాకముందు ఇచ్చిన 100శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలి.
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బీఆర్‌ఎస్‌కేలో పనిచేస్తున్న వారికి రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అమలు.
- ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.
- మరణించిన ఏఎన్‌ఎం కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- పెండింగ్ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలి.
- 8గంటల పనివిధానం అమలు చేయాలి.
- నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వారిని జీవోనంబర్ 16లో చేర్చి పర్మినెంట్ చేయాలి.
- రూ.5000 రిస్క్ అలవెన్స్ కేటాయించాలి.



**క్రమబద్ధీకరించాలి**

ఉద్యోగాల క్రమబద్ధీకరణపై ప్రకటన చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులుగా పలువురు చనిపోయారు. వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు అందివ్వాలి. రెగ్యులర్ చేయకపోగా.. పలురకాల పనులు చేయాలని ఒత్తిడి తేవడం మానుకోవాలి.

– గాండ్ల మధురిమ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**కమిషనర్‌కు సమ్మె నోటీస్**

నెల క్రితమే రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చాం. వైద్య ఆరోగ్య శాఖలో 48 గంటల సమ్మె ఇదే మొదటిది. రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసేవరకూ పోరాటం ఆపేది లేదు.

– తోట రామాంజనేయులు, రెండో ఏఎన్‌ఎం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



### మా స్థలం మాకు ఇప్పించండి



నిరసన తెలుపుతున్న ప్రభాకర్ అతడి కుమారుడు

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని పాత జెండా సమీపంలో తమ స్థలంలో అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని వెంటనే అధికారులు చొరవ తీసుకొని పనులు ఆపాలని కందుకూరి ప్రభాకర్ కోరాడు. ఆదివారం నిర్మాణం జరుగుతున్న ప్రాంతం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన తండ్రి వెంకటాచారికి ముగ్గురు సంతానమని, పూర్వీకులు నివసిస్తున్న గృహం కావడంతో దాన్ని ఎవరూ అమ్మకం చేయలేదన్నారు. పలువురు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. తనకు సంబంధించిన ఆస్తిపై సంతకాలు ఎక్కడా పెట్టలేదని, నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి తనకు న్యాయం చేయాలని పోలీసులు, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. పనులు ఆపేందుకు వెళ్లగా చంపుతామని బెదిరిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సైతం తన తమ్ముడు కళాకర్‌చారి ద్వారా చేసుకున్నారని, అతడి మానసిక స్థితి సరిగా లేదని తెలిపారు. మ్యుటేషన్, లింకు డాక్యుమెంట్లు చూపించకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. ఈసందర్భంగా కొనుగోలుదారులు మాట్లాడుతూ, ఆబాది భూమి కావడంతో కందుకూరి కళాకర్‌చారి ద్వారా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు పోలాస సత్యనారాయణ, కార్యదర్శి కందుకూరి ప్రకాశ్‌రావు తెలిపారు. ఎలాంటి పొరపాటు చేయలేదని అమ్మకం చేస్తేనే కొన్నామని వివరించారు. వారి ఆరోపణల్లో నిజం లేదని తెలిపారు.

# గిరిజనుడి కుటుంబానికి న్యాయం చేయండి

- ఇసుక క్వారీ నిర్వాహకులతోనే కొమురయ్య మృతి
- ప్రజాసంఘాలు, రాజకీయ నాయకుల రాస్తారోకో
- నచ్చజెప్పి విరమింపజేసిన పోలీసులు
- జిల్లా ఆసుపత్రి వద్ద కొంతసేపు ఉత్కంఠ



జిల్లా ఆసుపత్రి వద్ద పోలీసు బందోబస్తు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట సమీపంలోని మానేరు నదిలో ఇసుక క్వారీ నిర్వాహకులు తవ్విన గుంతలో పడి మృతిచెందిన బండి కొమురయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందించి న్యాయం చేయాలని పౌరహక్కుల సంఘం నాయకుడు సుదర్శన్, బీఎస్పీ, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కొమురయ్య మృతదేహానికి పోస్టుమార్టం పెద్దపల్లిలోని జిల్లా ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి పలు సంఘాలు, పార్టీల నాయకులు చేరుకుని గిరిజన కుటుంబానికి మద్దతుగా నిలిచారు.

**రాస్తారోకోకు యత్నం**

జిల్లా ఆసుపత్రి వద్దకు చేరుకున్న పలువురు నాయకులు కాల్వశ్రీరాంపూర్ ఎస్‌ఐ శ్రీనివాస్‌తో మాట్లాడారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఇసుక క్వారీ నిర్వాహకులను రప్పించాలని నాయకులు కోరారు. తమ వద్ద వారి సమాచారం లేదని చెప్పడంతో గిరిజనులతో కలిసి రాజీవ్‌రోడ్డుపై బైఠాయించేందుకు యత్నించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ వారితో మాట్లాడి తాము అన్నివిధాల సహకరిస్తామని చెబుతున్నా ఇలా రోడ్డెక్కేందుకు యత్నించడం సరికాదన్నారు. అమాయక గిరిజనులపై అనవసరంగా కేసులు నమోదయ్యేలా చూడొద్దన్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, సుల్తానాబాద్ సీఐ జగదీశ్, ఎస్సై విజయేందర్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో వెనుదిరిగారు. కాగా ఇసుక క్వారీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని మృతుడి కుటుంబానికి పరిహారం ఇప్పించాలని పౌరహక్కుల సంఘనాయకుడు సుదర్శన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు తీర్పులను గౌరవించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వారిపై ఫిర్యాదులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**కళ్లముందే కనుమరుగయ్యాడు**



కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా చిట్యాలమండలం ఎంచపల్లికి వెళ్లేందుకు తన భర్త కొమురయ్యతో పాటు కొడుకు, కోడలు శ్రీనివాస్, శ్రావణి, మనుమరాలు వర్షిణితో వాగులో నడుస్తుండగా కొమురయ్య కయ్యలో పడిపోయాడని మృతుడి భార్య లక్ష్మి తెలిపింది. ఎంచపల్లిలో పొలం వద్ద పాలేరుగా పనిచేశాడని, పనిముగియడంతో అక్కడ ఉన్న తమ సామగ్రిని తెచ్చుకుందామని వెళ్తుండగా ఇలా జరిగిందని రోదించింది. తమకు న్యాయం చేయాలని వేడుకుంది. కాల్వశ్రీరాంపూర్ పోలీసులకు మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది.

– మృతుడు కొమురయ్య కుటుంబీకులు

# కార్మికులపై ప్రభుత్వాల చిన్నచూపు

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): అసంఘటిత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జనక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అసంఘటిత కార్మిక సదస్సులో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు కూలీలకు కనీస పని దినాలను ఏడాదికి 200 రోజులు పెంచి, రోజువారీ వేతనం కనీసం రూ.400 చెల్లించేలా చూస్తామన్నారు. త్వరలోనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్మిక డిక్లరేషన్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోటి ఇరవై లక్షల మంది కార్మికులు లబ్ధి పొందుతారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మోదీ ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేస్తామని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. సింగరేణి అవుట్ సోర్సింగ్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేస్తామని వెల్లడించారు. రిటైర్డ్ కార్మికులకు పే రివిజన్ చేస్తామన్నారు. అన్ని మున్సిపాలిటీల్లోని సఫాయి కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని, భవన నిర్మాణ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చట్టాలను అమలు పరుస్తామన్నారు. బీడీ కార్మికుల వేతనాలు పెంపు, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ బోర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కస్తామని తెలపారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి దాస్, నరసింహారెడ్డి, వంగ లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్‌యాదవ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



**33 ఏళ్లకు.. ఒక చోటకు..**

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదివిన విద్యార్థులు 75 మంది 33 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఇదే బ్యాచ్‌లో చదువుకున్న పది మంది మరణించగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని సమావేశానికి ముందు మౌనం పాటించారు. తర్వాత అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం ట్రస్టు ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా కృషిచేయాలని తీర్మానం చేశారు.

# ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల విధుల బహిష్కరణ

- మూడు రోజులుగా పనులకు దూరం
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కర్మాగారంలో లోడింగ్ కార్మికులు

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పనిచేస్తున్న లోడింగ్, బ్యాగింగ్, స్టిచ్చింగ్ కార్మికులను కాంట్రాక్టర్ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. లోడింగ్ కార్మికులకు రూ.750కు బదులు రూ.550 చెల్లిస్తున్నారని, రోజుకు 896 నుంచి 1100 బస్తాలు లోడ్ చేయడం ద్వారా పని ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. లోడింగ్, బ్యాగింగ్, స్టిచ్చింగ్ విభాగంలో ప్రస్తుతం 350 మంది విధులు నిర్వర్తిస్తున్నారని, వారికి టార్గెట్ విధిస్తూ పనిభారం మోపుతున్నారని అంటున్నారు.

**బస్తాకు రూ.1.20 చెల్లిస్తున్న కాంట్రాక్టర్**

లోడింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు బస్తాకు రూ.1.20 చొప్పున చెల్లిస్తున్నారని, దానిని రూ.రెండుకు పెంచాలని కోరుతూ లోడింగ్, స్టిచ్చింగ్ విభాగం కార్మికులు మూడు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ బిహార్ నుంచి కార్మికులను తెప్పించుకుని స్థానిక కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని అంటున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ విధులకు హాజరయ్యేది లేదని, అవసరమైతే సోమవారం కర్మాగారం గేట్ వద్ద ధర్నా చేస్తామని చెబుతున్నారు.



**సమస్య పరిష్కరించాలి**

కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. లోడింగ్ కార్మికులకు కాంట్రాక్టర్ రూ.1.20 చెల్లిస్తే ఎలా? బస్తాకు రూ.2 చెల్లిస్తే గిట్టుబాటు అవుతుంది. సమయపాలన లేకుండా విధులు కేటాయించడంతో అనారోగ్యం బారిన పడుతున్నాం.

– సారయ్య, కాంట్రాక్టు కార్మికుడు

**ప్లాంట్‌ను ముట్టడిస్తాం**

కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలి. లోడింగ్, స్టిచ్చింగ్ కార్మికులకు బస్తాకు రూ.రెండు చెల్లించాలి. ఈపీఎఫ్ ఈఎస్‌ఐ కాంట్రాక్టర్ చెల్లించాలి. సమస్య పరిష్కరించకుంటే కర్మాగారం ముందు ఆందోళన చేస్తాం.

– అంబటి నరేశ్, ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు



# ఆధార్‌తో 134 పరీక్షలు ఉచితం

సుల్తానాబాద్: జిల్లాకేంద్ర ఆసుపత్రిలో ఈనెల ఒకటిన ఏర్పాటు చేసిన టీహబ్‌లో రూపాయి ఖర్చు లేకుండా కేవలం ఆధార్‌కార్డుతో 134 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. ఇటీవల ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రూ.78 లక్షలు వెచ్చించి అత్యంత ఖరీదైన ఐదు యంత్రాలతో రేడియాలజీ హబ్‌ను ఏర్పాటు చేసి టీహబ్‌కు బాధ్యతలు అప్పగించింది. మొన్నటివరకు 54 పరీక్షలు మాత్రమే చేసిన సిబ్బంది.. తాజాగా 134 వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో టీహబ్ సేవలను ఈనెల ఒకటిన మంత్రి హరీశ్‌రావు వర్చువల్ పద్ధతిన ప్రారంభించగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 2,700 మంది రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి ఫలితాలు ప్రకటించారు. ఈసీజీ, 2డీ–ఇకో, అల్ట్రాసౌండ్, మామోగ్రామ్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలోని 32 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి నమూనాలు ఇక్కడికి వస్తుంటాయి. జిల్లా అధికారులు మూడు వాహనాలను మూడుప్రాంతాలుగా విభజించి కేటాయించారు. ఫలితాలను సెల్‌ఫోన్‌కు 24 గంటల్లో మెసేజ్ చేస్తున్నారు. ఫోన్ లేనివారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రింట్ తీసి ఇవ్వనున్నారు. రిపోర్టు పరిస్థితిని చూసి సంబంధిత డాక్టర్లు వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సలహాలు, సూచనలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

**సేవలు వినియోగించుకోవాలి**



జిల్లా ఆసుపత్రిలోని టీహబ్ ద్వారా వివిధ రకాల పరీక్షలు చేస్తున్నాం. పేదలు ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలి. త్వరలో కేన్సర్‌కు సంబంధించి మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. టీ హబ్ లో 134 రకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నాం.

–శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్


### బెస్ట్ ఫొటోగ్రఫీ కపుల్‌గా సుజాతప్రసాద్



అవార్డు స్వీకరిస్తున్న సుజాతప్రసాద్ దంపతులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్‌కు చెందిన బండారి సుజాతప్రసాద్ దంపతులు ఫొటోగ్రఫీ రంగంలో రాణిస్తూ, ప్రతిభ కనబరిచినందుకు అవార్డు వరించింది. ఆదివారం ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా బెస్ట్ ఫొటోగ్రఫీ కపుల్ అవార్డు -2023, మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుజాతప్రసాద్ దంపతులు 12 సంవత్సరాలుగా ఫొటోగ్రఫీ రంగంలో రాణిస్తూ, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా జీవనం సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో స్వప్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాపర్‌వైర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న వైర్‌తో సెక్యూరిటీ సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–1 వర్క్‌షాప్ కాంపౌండ్ వెనక నుంచి మోటార్ వైండింగ్‌కు సంబంధించిన కాపర్ వైరు ఎత్తుకెళ్తుండగా ఆర్జీ–2 సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది విధినిర్వహణలో భాగంగా డ్రాగ్‌లైన్ యార్డు నుంచి ఓల్డ్ స్టోర్స్ వైపు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దొంగలు కాపర్‌వైర్ చోరీ చేసుకుని వెళ్తూ కన్పించారు. ఈక్రమంలో వారిని పెట్రోలింగ్ సిబ్బంది వెంబడించి పట్టుకునేందుకు ప్రయత్నించగా కాపర్ వైర్ అక్కడే పడేసి పరారయ్యారు. పట్టుకున్న కాపర్‌ను స్టోర్స్‌లో అప్పగించారు. చోరీకి గురైన కాపర్ సుమారు క్వింటాల్ బరువు, దాని విలువ రూ.లక్ష మేర ఉంటుందని అధికారులు తెలిపారు.

### సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఉపకరణాలు చోరీ

రామగుండం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు సమీపంలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఉపకరణాలు చోరీకి గురైనట్లు రామగుండం ఏఈ దామోదర్‌రావు తెలిపారు. ఆదివారం రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సరఫరాలో వినియోగించే ఉపకరణాలను సబ్‌స్టేషన్ ప్రాంగణంలో స్టోర్ చేయగా, ప్రతీ వారం రోజులకు ఒకసారి సామగ్రిని పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం సదరు సామగ్రిని తన సిబ్బంది మామిడి శంకరయ్య, ఆకుల శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించగా ఏబీ స్విచ్‌లు, ఎర్త్ పైపులు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి వాటి విలువ రూ.50వేలుగా పేర్కొంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శరణ్య తెలిపారు.